# రామ్మూర్తి

రెండేళ్ళక్రితం బి.ఎ పాసైన రామ్మూర్తి గూని గుడిసెలోనుంచి బయటికొచ్చి....వాకిట్లో నిలబడి మెరిసే కళ్ళతో ఆకాశంలోకి చూశాడు.

ఆకాశం గడ్డకట్టిన సముద్రంలా వుంది.

ఓ పక్షి రెక్కలూపుకుంటూ ఎగురుతూ ... చూస్తుండగానే ... పైకి-యింకా పైకి...

పోతూనే వుంది—

అనంతాకాశంలో...శూన్యంలో ప్రశాంతతలో....ఒక్క పక్షి ఆకాశాన్నే తాగేస్తూ ఓహ్...! ఎంత స్వేచ్ఛ-

రామ్మూర్తి హృదయం పరుచుకున్న ఆకాశంలా వుంది.

వాకిట్లోని చింతచెట్టు క్రింద బండరాయిపై కూలబడ్డాడు.

ప్రక్కింటి రేడియోలో నుంచి వివిధ భారతి తెలుగుపాటల కార్యక్రమం వినబడుతుంది... అంటే యింకా తొమ్మిది కాలేదన్నమాట-

రామ్మూర్తి జేబులో నుంచి మడిచిన కాగితాలను బయటకి తీసి మళ్ళీ ఓసారి చూచుకున్నాడు.

సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో తనను అపాయింట్ చేస్తూ యివ్వబడ్డ ఆర్డర్స్ ... ఆరోజు యిక ఉద్యోగంలో జాయిన్ కావడానికి తను సిద్ధం చేసిన జాయినింగ్ రిపోర్టు

జీవితంలో మొట్ట మొదటిసారిగా ఉద్యోగంలో చేరుతూ... తనూ ఓ స్వతంత్రమైన మనిషిగా బ్రతుకులోకి అడుగు పెట్టబోతూ-

ఓహ్- గుండెల నిండా హాయి హాయి హాయి-

యింకా రెండు గంటలు గడుస్తేగాని ఆఫీసు తెరువరు..అప్పుడు గాని తను వెళ్ళి జాయిన్ కాడు.

అబ్బా... యింకా రెండు గంటలే....! తొందర... తొందర-

అతని హృదయం నీటిని చిమ్ముతున్న ఫౌంటెన్ లా వుంది.

"అమ్మా... అమ్మా"

లోపలనుంచి ఓపండు ముసలి మట్టిలోనుంచి పురుగులా భారంగా బయటి కొచ్చింది.

"అప్పుడే స్నానం చేసి తయారైనావ్రా... ఓర్నీ పంబరం చల్లగుండా.... గింత తొందరాన్రా కొలువుల చేరెటానిక్కి"

ఆమెకళ్ళు వెలుగుతున్న చిచ్చు బుడ్లలా వున్నాయి.

రామూర్తి మాట్లాడలేదు. నవ్వాడు. నవ్వి తల్లి పాదాలకు మొక్కి- నడవడం ప్రారంభించేడు బస్టాండ్ దిక్కు.

అతను కనుచూపు మేర దాటేదాక చూస్తూ వుండి పోయింది. వెంటనే ఆమె కళ్ళలో నుంచి జల జలా నీళ్ళు కారి నిలిచిపోయేయి చెంపల ముడతల్లో "కొల్వుల చేరే యీ దినమైనా బుక్కెడు కూడు వండిపెట్ట లేక పోయిన పోరనికి...థూ(....ఏం జల్మం తనది." ...ఆమె నిశ్శబ్దంగా కాలుతున్న క్రరలా వుంది.

రామూర్తి బస్సుకోసం గంట సేపు నిలబడి.... జనంలో నుంచి యుద్ధంలో గాయపడ్డ సైనికునిలా బయటపడి ఆఫీస్‌కొచ్చేసరికి పదీయిరవై

నిముషాలైంది. అప్పటికి ఆఫీస్‌లో వాచ్‌మాన్ తప్ప యింకెవరూ లేరు.

టిక్కు టిక్కు మంటూ కూర్చున్నాడు. పదకొండూ పది నిము షాలకు వచ్చాడు సబ్-రిజిస్ట్రార్. జాయినింగ్ రిపోర్టిచ్చాడు.

సబ్ రిజిస్ట్రార్ నవ్వి సూపరింటెండెంట్‌కు డైరెక్ట్ చేశాడు. చేసి "ఓ రెండ్రోజులు ట్రైన్ చెయ్యండి కుర్రోణ్ణి" అన్నాడు.

"రెండ్రోజులెందుకుసార్, సాయంకాలంవరకు మనకు పాఠాలు చెప్పడండీ..." సూపరింటెండెంట్ తొందలా నవ్వాడు. రామ్మూర్తిని తీసుకెళ్లి ఓ సీట్‌లో కూర్చోమని చెప్పి "నీ ఎదురుగా వున్న ఏదైనా ఫైలు తీసుకుని చూస్తూండు. యివ్వాళ నీ సీట్‌లో పనినంతా నేను చేసి చూపిస్తాను....ఊఁ...పోతే...యీ మన ఆఫీస్‌లో మనం పని సరిగా చేయకున్నా ఫర్వాలేదుగాని మనమధ్య ఐకమత్యం మాత్రం వుండాలి. అది చాలా ముఖ్యం. ఎందుకు ముఖ్యమో సాయంకాలం తెలుస్తుంది నీకు." అని చెప్పి వెళ్ళిపోయాడు సూపరింటెండెంట్.

రామ్మూర్తి ఓ ఫైలువిప్పాడు.

ఫైల్ నోట్....డ్రాఫ్ట్...ప్రొసీడింగ్స్...వాటికి ఓ ప్రత్యేకమైన ప్రొఫార్మ—

వీటిని ఎన్నడూ చెప్పలేదు తన మూడేండ్ల బి ఎ చదువులో. యీ దేశంలో చదివే చదువు ఒకటి—చేసే వుద్యోగం ఒకటి....రోగం ఒకచోటయితే మందు మరొకచోట పెట్టినట్టు.

యీ లోగా ఆస్తులను రిజిష్టర్ చేయించుకోదలచిన పార్టీలు వస్తున్నాయి. బయటయిద్దరు ప్యూన్లు యూనిఫారాల్లో అలర్ట్‌గా.... సైనికుల్లా నిలబడి పార్టీలతో "డీల్" చేస్తున్నారు.

ఫయిళ్ళను ఓ గంటన్నర చూశాక అర్థమైన విషయమేమిటంటే—

సిటీలోని ప్రాంతాలను కొన్ని బ్లాకులుగా చేశారు. ఒకొక్క బ్లాక్‌లోని స్థలానికి కొంత నిర్దుష్ట కనీసధర నిర్ణయించబడిన చార్ట్ ఒకటి వుంది. వాటిప్రకారంగా పార్టీ కొన్న స్థలం లేక యిల్లు ధర నిర్ణయించి దాంట్లో పదిశాతం విలువగల కోర్టు స్టాంపులను పార్టీచేత కొనిపించాలి.

సూపరింటెండెంట్ వచ్చాడు హడావిడిగా రామ్మూర్తి దగ్గరకు—

"చార్ట్ తీయండి—" తీసిచ్చాడు.

సూపరింటెండెంట్ వెంట ప్యూన్ వున్నాడు. "ఏ బ్లాక్‌రా"

"యిరవై రెండు"

చూశారు ధర చదరపు గజానికి యిరవై రూపాయలుంది.

"చూడూ.... రేటు గజానికి ముప్పయ్యయిదు చెప్పు. నూర్రూపాయలు మ్యామ్యాయిస్తే యిరవైకి చేపిస్తానని బేరంచేయి...ఊఁ..."

"అట్లనే సార్"—ప్యూన్ టోపీ సవరించుకుంటూ వెళ్ళిపోయాడు.

అన్యాయం ... అన్యాయం ... మోసం ... జనాన్ని చూస్తూ చూస్తుండగానే దగాచేస్తున్నారు. రామ్మూర్తిపైన పాముపడ్డట్టుగా అదిరిపడ్డాడు.

సబ్-రిజిస్ట్రార్ ముందరి ప్యూన్ ఓ డాక్యుమెంట్స్ కట్టనూ, వాటిక్రింద ఓ నోట్ల కట్టనూ తెచ్చి రామ్మూర్తి టేబుల్‌పై వుంచి పోయాడు వెంటనే సూపరింటెండెంట్ పరుగున లేచివచ్చి...నోట్ల కట్టను లెక్కపెట్టి జేబులో కుక్కుకుని—డాక్యుమెంట్‌పైన ఓ చిట్టీని అంటించి "వెరిఫైడ్" అని రాసి "క్రింద యినీషియల్ వేయండి"—అన్నాడు రామ్మూర్తితో. రామ్మూర్తి తలంతా తిమ్మిరెక్కి మొద్దుబారిపోయినట్టుంది యాంత్రికంగా యినీషియల్ చేశాడు. దాని ప్రక్కన

సూపరింటెండెంట్ కూడా సంతకంచేస్తూ–"యీ కట్ట యివ్వకుంటే యీ డాక్యుమెంట్స్ కట్టపై లక్ష కొర్రీలు వేస్తాం మనం. మనదగ్గరున్న రూల్స్‌తో పార్టీలను చిత్రహింసలు చేయవచ్చు. అందుకని అందరూ మన మామూళ్ళను మనజేబుల్లో పారేసి వాళ్ళపని వాళ్లు చేసుకుంటారు సుబ్బరంగా...విన్నారా'' అని యికిలిస్తూ వెళ్ళిపోయాడు.

వెంటనే ప్యూన్ డాక్యుమెంట్స్ కట్టను పట్టుకుపోయాడు.

ఎదురుగా సబ్-రిజిస్ట్రార్ పాన్ నములుతూ నిశ్శబ్దంగా... కుందనపు బొమ్మలా కూర్చుని యుగపురుషునిలా చిద్విలాసంగా సంతకాలు పెడుతున్నాడు.

రామ్మూర్తి దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో వెనక్కి తల వేలాడేసి ఒరిగాడు–

వెనక కిటికీకి అవతల–ఎవరో వ్యక్తి తమ ప్యూన్‌కు ఓ నూర్రూపాయల నోటు యిస్తూ–

ఉలిక్కిపడ్డాడు రామ్మూర్తి యింత బహిరంగంగా లంచం– భయం లేకుండా....విశృంఖలమైన అవినీతి...దోపిడీ–కరప్షన్... కరప్షన్–అతని తలలో డైనమైట్లు ప్రేలుతున్నాయి.

యిన్నాళ్ళబట్టీ తను కలలుగన్నది యీ ఉద్యోగం కోసమా– తన చదువంతా తనను ఓ లంచగొండిగా మార్చడానికా....యిన్నాళ్ల తన ఆదర్శం...తన స్వప్నాలు...తను ఊహించిన జీవితం–అన్నీ పగిలిన గాజు పలకలా–ఆఫీసు ఓ పాములా పుట్టలా అనిపిస్తోంది రామ్మూర్తికి–

సాయంత్రం ఆరు దాటింది. ఐనా రిజిస్ట్రార్ బుద్ధునిలా యింకా సంతకాలు పెడుతున్నాడు. ఆఫీస్ యింకా పనిచేస్తోంది. ఎందుకు

పనిచేస్తోంది బైమయిపోయినా-? మ్యామ్యాలు వస్తున్నాయి కాబట్టి-లైట్లు వేశారు. ఏడుగంటలకు-పార్టీలన్నీ పోయాక-ఆఫీస్ వెనుక వరండాలో ఆఫీస్‌లోని గుమాస్తాలూ, ప్యూన్లూ, సూపరింటెండెంట్ ఓ చోట గుమిగూడి ప్రొద్దంతా జమచేసిన రూపాయలన్నింటినీ ఓ చోట పోసి లెక్క-పెట్టే-ఎనిమిదివందల అరవై ఆరురూపాయలున్నాయి.

సూపరింటెండెంట్ ఓ రెండువందల యాభై రూపాయలను ఓ కవర్లో పెట్టి ప్యూన్‌తో పంపించాడు సబ్-రిజిస్ట్రార్‌కు. తర్వాత ఓ తెల్ల కాగితం తీసుకుని వాటాల లెక్క వేస్తున్నాడు.

రెండు నిముషాల తర్వాత సబ్-రిజిస్ట్రార్ కారు చప్పుడు వినిపించింది.

డబ్బును అందరూ పంచుకుని-"మీవంతుకు నలభై రెండు-" అని నోట్లను అందించాడు సూపరింటెండెంట్.

నోట్లు జేబులో వున్నాయి.

బస్సులో-కిటికీలోనుంచి చీకట్లోకి చూస్తూన్న రామ్మూర్తికి.... జేబులో జలగలున్నట్లనిపిస్తుంది.

x x x x

అర్ధరాత్రి దాటింది.

వాకిట్లో అలాగే కూర్చుని ఆలోచిస్తున్నాడు రామ్మూర్తి.

ఎదురుగా దీపం-గాజు ఎక్క నడుమ ఎర్రగా మండుతోంది.

ఓ నిర్ణయాని కొచ్చిన మనిషిలా చటుక్కున లేచి-లోపలినుంచి ఓ తెల్ల కాగితం తెచ్చి చకచకా రాయడం ప్రారంభించాడు రాజీనామాను-

వెంటనే జేబులోనుంచి నోట్లను తీసి-దీపం ఎక్కను తీసి-

మొదట యిరవై రూపాయల నోటును అంటించి–బూడిదై పోయి–మళ్ళీ ఓ నోటు...నోటు కాలుతున్న వెలుగులో రామ్మూర్తి ముఖం నక్షత్రంలా వెలిగిపోతోంది.

తృప్తిగా కళ్ళుమూసుకుని నిట్టూర్చాడు.

x x x x x

స్టేషన్ రద్దీగా వుంది. జనం కిటకిటలాడిపోతున్నారు.

ప్లాట్ ఫాంపై నిలబడ్డ రైలు–ఫస్ట్‌క్లాస్ ఎ.సి. కంపార్ట్‌మెంట్ దర్వాజాపై రాయి తుపాకీ గుండులా భళ్లన తగిలింది.

అందరూ ఉండేలు దెబ్బ చప్పుడు విన్న పక్షుల్లా అదిరిపడి–

"పట్టుకోండి పిచ్చోన్ని" "పట్టుకోండి పిచ్చోన్ని"

పిచ్చోడు పరుగెత్తుతున్నాడు బాణంలా.

ఆ పరుగెత్తే పిచ్చోని పేరే రామ్మూర్తి.